పట్టుదలతో
లక్ష్యం వైపు
● సినీరంగంలో రాణిస్తున్న జాన్‌జక్కీ

జీవిత పాఠాలే
ఆయన కథనాలు
● బుల్లితెరపై కథలు, మాటలు పలికిస్తున్న మహేందర్

7

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.240

పల్లెల్లో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఎక్కడా చూసినా చర్చ నడుస్తోంది. ఆశావహులు ముందస్తుగా నామినేష్లు వేస్తున్నారు. సమరాంగణంలో గెలుపు కోసం పార్టీలు వ్యూహరచనలు చేస్తున్నాయి. అత్యధిక స్థానాలు సాధించి సత్తా చాటాలని రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నాల్లో ఉన్నాయి. వీటితో పాటు బీజేపీ, ఇతర పార్టీలు కూడా వారి వారి ప్రయత్నాల్లో నిమగ్నమయ్యాయి.
- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)



సమాలోచనలు

- విజయం కోసం ప్రధాన పార్టీల వ్యూహాలు
- అంతర్గత సమావేశాలు
- ధనబలం, సామాజిక సమీకరణలపై సమీక్షలు

మూడు విడతల పంచాయతీ ఎన్నికల్లో మొదటి విడతకు నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి మొదలైంది. విజయం కోసం బీఆర్ఎస్ పార్టీ మండల స్థాయి సమావేశాలు నిర్వహించింది. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఎటువంటి సమావేశాలు చేపట్టలేదు. ఎన్నికల ప్రక్రియ మొదలు కావడంతో పార్టీలు పూర్తిగా అభ్యర్థులు, పోలింగ్, బలాబలాలు, ప్రత్యర్థుల బలహీనతలపై దృష్టి సారించాయి.

ఇన్‌చార్జిలతో సమన్వయం

సూర్యాపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి మూడు నెలల క్రితం ఎంపీటీసీల వారీగా ఇన్‌చార్జీలను ఏర్పాటుచేసి క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించారు. సూర్యాపేట పట్టణ పరిధిలోని ముఖ్యనాయకులకు సూర్యాపేట, పెన్‌పహాడ్, చివ్వెంల, ఆత్మకూర్(ఎస్) మండలాల పరిధిలోని ఎంపీటీసీల స్థానాల వారీగా ఇన్‌చార్జిలుగా నియమించారు. వారి ద్వారా స్థానిక నాయకులను సమన్వయం చేసుకుని వారికి కేటాయించిన పరిధిలో అంతర్గత సమావేశాలు నిర్వహించారు. దీంతో పాటు గ్రామాల్లో బీఆర్ఎస్ మద్దతుతో ఎన్నికల్లో పోటీ చేస్తే విజయం సాధించే అభ్యర్థుల పేర్లను సేకరించారు. తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్‌లు మండలస్థాయిలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎలాంటి సమావేశాలు నిర్వహించలేదు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి పరిపాలనలో జరిగిన వైఫల్యాలపై బీఆర్ఎస్ ప్రచారం చేయనుంది. ఇటీవలి యూరిత కొరత, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించి లబ్ధి పొందాలని బీఆర్ఎస్ భావిస్తోంది.

మహిళలకు యథావిధిగా..

(ఆంధ్రజ్యోతి- సూర్యాపేట): పలుమార్లు వాయిదా పడిన పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు అభ్యర్థుల జాతకాలను మార్చాయి. జిల్లాలో 486 పంచాయతీల్లో బీసీలకు 66 మాత్రమే దక్కాయి. అయితే జనరల్ స్థానాల్లో నిలబడేందుకు వారికి అవకాశం ఉంది. 208 జనరల్ స్థానాల్లో బీసీల నుంచి గట్టి పోటీ ఉండే అవకాశం ఉంది. అంతేకాక కాంగ్రెస్ పార్టీ కూడా బీసీలకు పార్టీ పరంగా అదే రిజర్వేషన్లు అమలు చేస్తామని స్పష్టం చేసింది. మహిళలకు గతంలో ఉన్న రిజర్వేషన్లు యథావిధిగా ఉంటున్నాయి. 486 స్థానాలకు జనరల్‌తో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ చేసిన అన్నిస్థానాల్లో 50 శాతం మహిళలకు కేటాయించారు.

సంక్షేమ పాలనపై కాంగ్రెస్ ఆశలు

పంచాయతీ ఎన్నికల్లో విజయానికి కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలపై ఆశలు పెట్టుకుంది. ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి విజయంతో వచ్చిన ఊపులో స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది. అదేవిధంగా..

- మిగతా 8వ పేజీలో...

నామినేషన్ కౌంటర్ 1వ రోజు

జిల్లా	27న సర్పంచ్‌కు	ఇప్పటివరకు మొత్తం	వార్డు స్థానాలకు	ఇప్పటివరకు మొత్తం
నల్లగొండ	421	421	234	234
సూర్యాపేట	207	207	38	38
యాదాద్రి	205	205	134	134
మొత్తం	833	833	406	406

తిరుమలగిరి మండలంలో నామినేషన్లు సున్నా

జిల్లా వ్యాప్తంగా ఎనిమిది మండలాల్లో సర్పంచ్‌తో పాటు వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు కాగా తిరుమలగిరి మండలంలోని వార్డు స్థానాలకు ఒక్క నామమినేషన్ కూడా దాఖలు కాలేదు. అత్యాధికంగా సూర్యాపేట మండలంలో సర్పంచ్ స్థానాలకు 40 నామినేషన్లు వచ్చాయి.

ప్రజావాణితో పరిష్కారం

అర్జీలపై స్పందిస్తున్న అధికార యంత్రాంగం
ప్రతి వారం అర్జీల పరిశీలనను సమీక్షిస్తున్న కలెక్టర్



ప్రజావాణిలో అర్జీలను స్వీకరించి పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

ప్రతీ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి సత్ఫలితాలనిస్తోంది. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు అన్ని విభాగాల అధికారులు హాజరవుతున్నారు. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. గడిచిన ఆరు నెలల్లో సుమారు 71 శాతం అర్జీలు పరిష్కారమయ్యాయి. 1,996 అర్జీలు రాగా 1,430 పరిష్కారమయ్యాయి.
- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

ప్రభుత్వ సేవలు, ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. గ్రామ, మండల స్థాయిలో పరిష్కారం లభించని సమస్యలను జిల్లా స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు జిల్లాస్థాయిలోనూ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ ఏడాది మే 1 నుంచి 1,996 దరఖాస్తులు రాగా, వీటిలో 1,430 అర్జీలను పరిష్కరించారు. ఇంకా 566 పెండింగ్‌లో ఉన్నాయి.

ఎక్కువ భూసమస్యలపైనే

జిల్లాలోని 23 మండలాల నుంచి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి భూసంబంధిత సమస్యల అర్జీలతో రైతులు కలెక్టరేట్ కార్యాలయానికి వస్తున్నారు. పాస్‌బుక్కులోని పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, భూముల వివరాలు తప్పుగా పడ్డాయని, పేర్లు తప్పుగా ఉన్నాయని, ఎక్కువ భూమి ఉంటే తక్కువగా పాస్ పుస్తకాల్లో చూపిస్తున్నారని...

- మిగతా 8వ పేజీలో...

సెక్యులర్ భావాలు కలిగిన వారికే
సీపీఎం మద్దతు



తుంగతుర్తిలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి

తుంగతుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో సీపీఎం ఉన్న గ్రామాల్లో పోటీ చేస్తుందని మిగతా చోట్ల సెక్యులర్ భావాలు కలిగిన వ్యక్తులకు మద్దతిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు.గురువారం నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్యాన్ని రాజ్యంగ హక్కులను కాలరాస్తూ ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ విధానాలకు అనుకూలంగా బడా కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ పేద మధ్యతరగతి వర్గాలపై భారాలను మోపే విధానాలను అవలంబిస్తుందని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యా దగిరిరావు, మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, కమిటి సభ్యులు పల్లా సుదర్శన్, ఎల్లయ్య, వెంకన్న, దేవరాజు, మడిపల్లి యాదగిరి, పాల్గొన్నారు

ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలి

సూర్యాపేటటౌన్: గ్రామపంచాయితీ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లునాగార్జునరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంవీఎన్ భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీని ఓడించడానికి లౌకిక పార్టీలతో కలిసి ముం దుకు వెళ్తామని తెలిపారు. వామపక్ష పార్టీలతో కలిసి ఎన్నికల్లో ముందుకు సాగుతామన్నారు. జిల్లాలో 56 స్థానాల్లో సర్పంచ్ అభ్యర్థులను బరిలో దిం౼ుతున్నామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి కందాల శంకర్‌రెడ్డి, పులుసు సత్యం, వేల్పుల వెంకన్న, నర్సింహారావు, ఉప్పలయ్య పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి

సూర్యాపేటటౌన్,నవంబరు 27(ఆంధ్రజ్యోతి):బాల్య వివాహరహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయడం జరుగుతుందని జిల్లా సంక్షేమ శాఖ అదికారి కె.నర్సింహారావు, డీఎంహెచ్‌వో పెండెం వెంకటరమణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జాతీయ బాల్యవివాహల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా యాక్షన్‌ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో 100 రోజుల బాల్య వివాహాల నిరోదక కార్యచరణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.బాల్య వివాహం నిర్మూలన ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందన్నారు. బాల్య వివాహాలను నిలుపుదలకు ట్రోల్‌ఫ్రీనెంబర్ 1098కు సంప్రదించాలన్నారు.బాలల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలన్నారు బాల్యవివాహాల నిర్మూలనకై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి. రవికుమార్, సీడీపీవో సుబ్బలక్ష్మి , కళాశాల ప్రిన్సిపల్ పెరుమాళ్ల యాదయ్య, మీరా, నాగరాజు, వాసు, సతీష్, శ్రీనివాస్, సోమయ్య, ఏలేందర్, వెంకటేష్, సుజాత పాల్గొన్నారు.

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

ఎన్నికల సాధారణ పరిశీలకుడు రవి

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను నిష్పక్షపాతంగా శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ కొత్తపల్లి నరసింహతో కలిసి ఎన్నికల నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఓటర్లు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా చూడాలన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికలపై వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో నిజ నిర్ధారణ చేసిన తర్వాతనే చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో ఎన్నికలు జరిగే ఆత్మకూర్(ఎస్), సూర్యాపేట, తుంగతుర్తి, నూతనకల్, అర్వపల్లి, నాగారం, మద్దిరాల, తిరుమలగిరి మండలాల పరిధిలో 159 గ్రామపంచాయతీలు, 1,442 వార్డులు, రెండో విడతలో పెన్‌పహాడ్, చివ్వెంల, కోదాడ, అనంతగిరి, మునగాల, నడిగూడెం, మోతె, చిలుకూరు మండలాల పరిధిలో 181 గ్రామాలు, 1628 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడో విడతలో హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్లచెర్వు, చింతలపాలెం, నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకీడు మండలాల పరిధిలో 146 గ్రామాలు, 1,318 వార్డులకు ఎన్నికలు జరగనున్నట్లు వివరించారు. అభ్యర్థుల ఖర్చు లెక్కించేందుకు 23 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, నాలుగు స్టాటికల్ టీంలు నిరంతరం పర్యవేక్షణ చేస్తాయన్నారు. ఎస్పీ కొత్తపల్లి నరసింహ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి, పక్కన కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సోషల్ మీడియా, గ్రీవెన్స్ సెల్ ప్రారంభం...

ఎన్నికల దృష్ట్యా కలెక్టరేట్‌లో సోషల్ మీడియా, గ్రీవెన్స్ సెల్‌ను ప్రారంబించారు. సోషల్ మీడియాలో రాజకీయ ప్రచారం, అసత్య ప్రచారం, ద్వేషపూరిత పోస్టులు, ఓటర్లను ప్రభావితం చేసే సందేశాలు, ఉద్రిక్తతలను రేకెత్తించే వ్యాఖ్యలు నిషేదించినట్లు పేర్కొన్నారు. అలాగే ఎన్నికలకు సంబంధించిన ఏమైనా ఫిర్యాదులు, సూచనలు స్వీకరించడానికి, చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు వంటి అంశాలపై వెంటనే 62814 92368కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కొలనుపాక సీతారామారావు, అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, జడ్పీ సీఈవో అప్పారావు, డీపీవో యాదగిరి, డీఎల్‌పీవో నారాయణరెడ్డి, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

అర్వపల్లి/నూతనకల్/ ఆత్మకూర్ (.ఎస్): పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు గుగులోతు రవి, కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, జిల్లా ఎస్పీ నర్సింహ అన్నారు. గురువారం జాజిరెడ్డిగూడెం, నూతనకల్, మిర్యాల ,ఆత్మకూర్(ఎస్) మండలం ఏపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ స్వీకరణ కేంద్రానికి మరో ఇద్దరిని మాత్రమే అనుమతించాలన్నారు. నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో వాహనాలు నిలిపే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఎలాంటి అనుమానాలు ఉన్న అధికారులు నివృత్తి చేయాలన్నారు. వారి వెంట డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ నర్సింహారావు, తహసీల్దార్లు శ్రీనివాసరావు,అమీన్‌సింగ్, ఎంపీడీవో సునీత, మహ్మద్ హసీం, సీఐ రాజశేఖర్, ఎస్‌ఐలు శ్రీకాంత్ గౌడ్, రావుల నాగరాజు ఉన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు అడిగే అర్హత లేదు

గరిడేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్‌కు ఓటు అడిగే అర్హత లేదని బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. మండ ల కేం ద్రంలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ మండల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పేరుతో డ్రామాలాడి ఇప్పుడు పార్టీ పరంగా అంటు బీసీల ను మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు త గిన బుద్ధి చెబుతారని కార్యకర్తలు అందరూ సమిష్టి కృషితో మండలంలోని అన్ని సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి అవినీతి సొమ్ముపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదన్నారు. తెలంగాణ వ్యతిరేకి మోదీ, తెలంగాణ ద్రోహి రేవంత్‌రెడ్డి, తెలంగాణ కు శాశ్వత వ్యతిరేకి చంద్రబాబు ముగ్గురు కలిసి నీటి మీద కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో గుగులోతు కృష్ణానాయక్, కడియం వెంకటరెడ్డి, శ్రీహరి, వెంకటరమణరెడ్డి, కడియం స్వప్న, స్రవంతి, కీత రామారావు, వెంకటరెడ్డి వీరయ్య రాజమహ్మద్, భాస్కర్, వెంకటేశ్వర్లు, హేమ్లానాయక్, సైదయ్య, నర్సయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి

సాగులో నూతన పద్ధతులు పాటించాలి



కాసరబాద గ్రామంలో రైతులకు అవగహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

సూర్యాపేటరూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సాగులో నూతన పద్ధతులు పాటించాలని ఏలూరు సెండ్ థెరిస్సా మహిళా కళాశాల అగ్రికల్చర్ విద్యార్థులు అన్నారు. మండలంలోని కాసరబాద గ్రామంలో గురువారం సాగులో నూతన పద్ధతులపై అవగాహన కల్పించారు. వరిసాగులో అల్లివేస్ ప్రాముఖ్యతను వివరించారు. వల్ల పొలాల్లో నీటి పారుదల సులభం గా ఉంటుందని, మొక్కల పెరుగుదల సమంగా పెరిగి అధిక దిగుబడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతులు కోతి గోపాల్‌రెడ్డి, అగ్రికల్చర్ విద్యార్థులు ఖుషీ మేఘన, మానస, జ్యోత్స్న రిషీత, ఇందు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేదపండితులు

మఠంపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి లక్ష్మీ నృసింహుని క్షేత్రంలో గురువారం శ్రీరాజలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహుని నిత్యకల్యాణాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. భక్తవత్సలుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. అనంతరం సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాల చేపట్టారు. ఉదయం హోమాదికాల భక్తిశ్రద్ధలతో చేశారు. తదుపరి కల్యాణమూర్తులను పరిణయోత్సవ వేదికపైకి పుణ్యాహవాచనం గావించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో అజ్మీర జ్యోతి, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘భయో’వ్యర్థాలు

- ఎక్కడపడితే అక్కడ పడవేత
- రెండు నుంచి మూడు రోజులైనా సేకరించని కాంట్రాక్టర్



(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్): జిల్లాలో ఆసుపత్రుల బయోవ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా వీటి సేకరణ కోసం అనుమతి పొందిన కాంట్రాక్ట్ సరైన సమయంలో సేకరించకపోవడంతో బయోవ్యర్థాలు ఆసుపత్రి నిర్వాహకులు బహిరంగ ప్రదేశాల్లో వదిలేస్తున్నారు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సేకరణకు సంబంధించిన కాంట్రాక్ట్ నిర్వాహకులు రెండు నుంచి మూడు రోజులకు ఒకసారి వస్తుండటంతో ఆసుపత్రుల్లో బయోవ్యర్థాలు పేరుకుపోతున్నాయి. అటు అధికారులు సైతం నిర్లక్ష్యంగా ఉండడంతో సేకరణలో జాప్యం జరుగుతోంది. ముఖ్యంగా ఆసుపత్రికి సంబంధించిన వ్యర్థాలను ఎరుపు, నీలం, నలుపు, పసుపు అనే నాలుగు రకాలుగా విభజిస్తున్నారు. ఎరుపు రంగులో సిరంజ్, గ్లూకోజ్ సీసాలు, నీలంలో గాజుసీసాలు, నలుపులో మునిసిపాలిటీకి సంబంధించిన వ్యర్థాలు, పసుపులో రక్తం మరకలకు సంబంధించిన వ్యర్థాలు వేయాల్సి ఉంటుంది.

రోజుకు 200 కిలోలు

జిల్లాలో సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి, నేరుడుచర్ల, హుజూర్‌నగర్ మునిసిపాలిటీలు ఉన్నాయి. సూర్యాపేటకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి బయోవ్యర్థాలను సేకరించడానికి రోమా ఇండస్ట్రీస్ కంపెనీకి అనుమతులు ఇచ్చారు. ఈ కంపెనీ సూర్యాపేట పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి బయోవ్యర్థాలను సేకరించాల్సి ఉంటుంది. రెండు రోజులకు ఒకసారి సుమారు 200 కిలోల వరకు వ్యర్థాలను సేకరిస్తున్నారు. వీటిని యాదాద్రిభువనగిరి జిల్లా సమీపంలోని కంపెనీ కేంద్రానికి తరలించి అక్కడే బూడిద చేస్తున్నారు. 30 పడకల ప్రైవేట్ ఆసుపత్రి నుంచి కిలోకి రూ.9, 50పడకలకు రూ.12 చొప్పున వసూల్ చేస్తారు. ఆలస్యంగా వస్తుండటంతో ఆసుపత్రుల్లో బయోవ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ముఖ్యంగా జిల్లాకేంద్రం కావడంతో సుమారు 60 నుంచి 80కు పైగా ప్రైవేట్‌ఆసుపత్రులు ఉన్నాయి. దీంతో సూర్యాపేటలో బయోవ్యర్థాలకు సంబంధించి రీసైక్లింగ్ ప్లాంట్ ఏర్పాటు లేకపోవడంతో సేకరణ వాహనంపైనే ఆధారపడాల్సి వస్తోంది. దీంతో వ్యర్థాల సేకరణ ఆలస్యమైతే రోడ్లపైనే, చెత్తకుప్పల్లో దర్శనమిస్తున్నాయి. నేరుడుచర్ల నుంచి 15రోజులకు ఒకసారి వాహనం రావాల్సి ఉండగా 20రోజులకు పైగా సమయం పడుతోంది.

అప్పటి వరకు వ్యర్థాలను కవర్‌లో వేసి ఉంచుతున్నారు. ఒక్కో సమయంలో కవర్‌ల కొరతతో బహిరంగ ప్రదేశాలే దిక్కుగా మారుతున్నాయి. హుజూర్‌నగర్, కోదాడకు ప్రతి వారానికి ఒకసారి వాహనం వెళ్లాల్సి ఉండగా 10రోజులు దాటుతోంది. వాహనం సరైన సమయంలో రాక ఇబ్బంది ఎదురవుతోంది.

బయోవ్యర్థాలు రోడ్లపై వేయవద్దు



ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు బయోవ్యర్థాలు రోడ్లపై వేయవద్దు. బయోవ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో వేస్తే ప్రజలకు ఇబ్బంది తలత్తే అవకాశం ఉంది. వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వాహనం వచ్చినప్పుడు అందజేయాలి. వాహనం సరైన సమయంలో వస్తుంది.
- సీహెచ్ హన్మంతరెడ్డి, మునిసిపల్ కమిషనర్

పంచాయతీల్లో సందడి





పంచాయతీ కార్యాలయాల్లో నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఆ ప్రాంతాలన్నీ సందడిగా కనిపిస్తున్నాయి. నామినేషన్ల సమయంలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఇద్దరు అభ్యర్థులు ఒకేసారి కార్యాలయంలోకి వెళ్లడం, రిటర్నింగ్ అధికారి వద్దే తప్పులు సరిచూసుకోవడం చేస్తున్నారు. ఎక్కువ సంఖ్యలో వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తూ ఫొటోలు దిగుతున్నారు.
(ఆంధ్రజ్యోతి-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి)

నిబంధనలు ఉల్లంగిస్తూ అధికసంఖ్యలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి వివిధ పార్టీల నాయకులు, అభ్యర్థులు

పంచాయతీ ఎన్నికల్లో గుర్తు.. గమ్మత్తు

- సర్పంచ్ అభ్యర్థులకు 30, వార్డు అభ్యర్థులకు 20 గుర్తుల కేటాయింపు
- గుర్తుల్లో చాయ్‌జాలీ, మూకుడు

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొదటి విడత ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసి, నామినేషన్ల స్వీకరణ ప్రారంభించారు. ఎన్నికల సంఘం సర్పంచ్ అభ్యర్థులకు 30, వార్డులకు 20 ఎన్నికల గుర్తులు కేటాయించింది. సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు వేర్వేరుగా ఎన్నికల గుర్తులు కేటాయించారు. సర్పంచ్ బ్యాలట్‌లో, వార్డు సభ్యుల బ్యాలెట్‌లో నోటా ఉంటుంది. సర్పంచ్ బ్యాలెట్ పేపర్ పింక్ కలర్‌లో, వార్డు సభ్యుల బ్యాలెట్ పేపరు వైట్ కలర్ ఉండనుంది.

సర్పంచ్ అభ్యర్థులకు

రింగు (ఉంగరం), కత్తెర, బ్యాట్, ఫుట్‌బాల్, లేడీస్ పర్సు, టీవీ రిమోట్, టూత్‌పేస్ట్, స్పానర్(పాన), చెత్త డబ్బా, బ్లాక్ బోర్డు, బెండకాయ, కొబ్బరితోట, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, చాయ్‌జాలీ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీలైట్, బ్రష్, బ్యాట్స్‌మెన్, పడవ, బిస్కెట్, ఫ్లూట్, చైన్, చెప్పులు, బెలూన్, స్టంప్స్ గుర్తులు కేటాయించారు.



సర్పంచ్ అభ్యర్థుల గుర్తుల్లో చాయ్‌జాలీ

వార్డు అభ్యర్థులకు

గౌను, గ్యాస్‌పొయ్యి, స్టూల్, గ్యాస్ సిలిండర్, బీరువా, విజిల్ (ఈల), కుండ, డిష్ యాంటినా, గరాట(గౌర), మూకుడు, ఐస్‌క్రీమ్, గాజు గ్లాసు, పోస్టు డబ్బా, కవర్(ఎన్ వలోప్), హకీ స్టిక్ బాల్, నెక్‌టై, కటింగ్ ప్లేయర్, పెట్టె, విద్యుత్ స్తంభం, టీ కెటిల్ కేటాయించారు.

కొన్ని గుర్తులపై పెదవి విరుపు

సర్పంచ్, వార్డులకు కేటాయించిన ఎన్నికల గుర్తులపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇవేం గుర్తులని పెదవివిరుస్తున్నారు. అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు అక్షర క్రమంలో గుర్తులు కేటాయిస్తారు. తమకు ఏ గుర్తు వస్తుందో, గ్రామీణ ఓటర్లు దాన్ని సరిగా గుర్తిస్తారో లేదోనని మదన పడుతున్నారు. మంచం, టేబుల్, బ్లాక్‌బోర్డు, పలక, బిస్కట్ లాంటి వాటిల్లో కొన్నింటి పోలిక దగ్గరగా ఉంటుందంటున్నారు. స్టంప్స్, హాకీ స్టిక్ నిరక్షరాస్యులకు ఏం తెలుసని ప్రశ్నిస్తున్నారు.

వార్డు మెంబర్ల అభ్యర్థుల గుర్తుల్లో మూకుడు



నామినేషన్ డిపాజిట్లు ఇలా

సర్పంచ్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ అయితే రూ.1000, ఇతరులలైతే రూ.2 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు రూ.250, ఇతరులకు రూ.500 డిపాజిట్ చెల్లించాలి.

ఎన్నికల ఖర్చు పరిమితి దాటొద్దు

పంచాయతీ ఎన్నికల్లోనూ అభ్యర్థులకు వ్యయ పరిమితి విధించారు. 5వేల జనాభా పైబడిన గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.2.50లక్షలు, వార్డు అభ్యర్థులు రూ.50వేలు, 5 వేల జనాభా లోపు ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.1.50లక్షలు, వార్డు అభ్యర్థులు రూ.30 వేలకు మించి ఖర్చు చేయరాదు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై అధికారుల నిఘా ఉంటుంది.

లారీడ్రైవర్‌కు జైలు, జరిమానా

నిడమనూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అతివేగంగా లారీని నడిపి నలుగురి మృతికి కారణమైన డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి టీ.స్వప్న తీర్పు వెల్లడించారు. కోర్టు లైసన్ అధికారి అలీ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం 2017 జనవరి 2న నాగార్జునసాగర్ సమీపంలోని దయ్యాల గండి వద్ద ప్రమాదవశాత్తు గడ్డి ట్రాక్టర్ బోల్తా పడగా పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. ఆ సమయంలో సిమెంట్‌లోడుతో మాచర్ల నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీని డ్రైవర్ అతివేగంగా నడపి పలువురిని ఢీకొనడంతో ఇద్దరు పోలీసులతో పాటు మరో ఇద్దరు చనిపోయారు. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది గాయపడ్డారు. లారీ డ్రైవర్ డిండి మండలం పాంపాడ్‌కు చెందిన మాధవరం రామేశ్వర్‌రావుపై సాగర్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సోమ్లానాయక్ ఫిర్యాదు మేరకు విజయపురి టౌన్ పీఎస్‌లో కేసు నమోదు కాగా సాగర్ సీఐ పార్థసారధి, ఎస్ఐ గౌరీనాయుడు విచారణ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కాగా కోర్టులో గురువారం కేసు విచారించిన న్యాయమూర్తి స్వప్న నిందితుడి నేరం రుజువు కావడంతో ఏడాది జైలుశిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ సాధన వాదనలు వినిపించగా, కోర్టు పీసీ శేఖర్ విచారణకు సహకరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు, ఐదుగురికి జరిమానా

నల్లగొండ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనం నడిపిన కేసులో నల్లగొండ కోర్టు ఒకరికి జైలుశిక్షతో పాటు ఐదుగురికి జరిమానా విధించినట్లు నల్లగొండ జిల్లా కేంద్ర ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య తెలిపారు. నల్లగొండ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా ఆరుగురు పట్టుబడినట్లు తెలిపారు. వారిలో ఐదుగురికి రూ.4,500జరిమానా విధించగా మరొకరికి ఒక్కరోజు జైలుశిక్షతో పాటు రూ.500జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పిందన్నారు. పోలీసులు చేపడుతున్న వాహనాల తనిఖీలు ప్రజల ప్రాణ రక్షణ కోసమని, ప్రజలు పోలీసులకు సహరించాలని కోరారు.

దివ్యాంగులకు క్రీడా పోటీలు రేపు

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 29 నుంచి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. జూనియర్ విభాగంలో అండర్-18, సీనియర్స్ విభాగంలో 18 నుంచి 54ఏళ్లలోపు వారికి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులకు చెస్, రన్నింగ్, షార్ట్‌పుట్, క్యారమ్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన వారిని హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనే వారు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని రావాలన్నారు.

మృతదేహం లభ్యం

నల్లగొండ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రామన్నపేట, చిట్యాల రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే ఎస్ఐ బీ రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం 10.50 గంటల సమయంలో సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి రామన్నపేట-చిట్యాల రైల్వేస్టేషన్ల మధ్యలో రైలు నుంచి జారీ కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండగా స్థానికులు సమాచారం అందించారని తెలిపారు. మృతుడు ఎత్తు 5.5 ఎత్తు, గుండ్రటి ముఖం, నలుపు రంగు, బట్టతల, తెల్లగడ్డం, వైట్ కలర్ షర్ట్ స్వచ్ఛభారత్ అని ఇంగ్లీషులో రాసి ఉన్నఆఫ్ వైట్ టీషర్ట్, కాళ్లకు శాండిల్స్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, నల్లగొండ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఏమైనా సమాచారం తెలిస్తే 8712 658595 ఫోన్ నెంబరుకు సమాచారం తెలపాలన్నారు.

పోరాడేవారిని గెలిపించాలి

మద్దిరాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించే అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించాలని సీపీఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట గోపి పిలుపునిచ్చారు. మద్దిరాల మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల కార్యదర్శి పోలోజు సైదులు, నాయకులు కల్లెపల్లి భాస్కర్, దీకొండ ఉపేందర్, మల్లారెడ్డి, మల్లారెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

గురుకులంలో ప్రకృతి ప్రసాదం

- పాఠశాల ఆవరణలో ప్రకృతి వ్యవసాయం

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని గురుకుల పాఠశాల చదువుతో పాటు జీవిత పాఠాలను నేర్పిస్తోంది. ఎలా బతకాలి, తమ పనులు తామే ఎలా చేసుకోవాలని నేర్పిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. అదేసమయంలో నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించేందుకు పాఠశాల ఆవరణలోనే ప్రకృతి(ఆర్గానిక్) వ్యవసాయం చేయిస్తున్నారు. కూరగాయలు సాగు చేస్తూ వాటితోనే రుచికరమైన భోజనం అందిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)



ఆకుకూరలు కోస్తున్న సిబ్బంది

నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలె బీసీ గురుకుల పాఠశాలలో ఆర్గానిక్ గార్డెన్ నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఆహార పంటలపై అవగాహన కల్పిస్తూ, ఆర్గానిక్ ఎరువులతో ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. వాటితోనే ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారం విద్యార్థులకు అందిస్తున్నారు. ఆహార ఉత్పత్తుల కోసం రైతులు ఎంత కష్టపడి పండిస్తారో తెలుసుకోవడానికి ఈ కిచెన్ గార్డెన్ ఉపయోగపడుతోంది. ఈ గార్డెన్ సాగును ఉన్నతాధికారులు సైతం సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఎకరం స్థలంలో వరితో పాటు బెండ, గోకర కాయలు, మెంతి కూర, గోంగూర, పాలకూర, చుక్క కూర, బచ్చలి కూర, పుదీనా, కోతిమీర, తోటకూర, మిర్చి, బంతి పూల సాగు చేపట్టారు.





వరినాట్లు వేస్తున్న విద్యార్థులు, తూకం వేసిన కూరగాయలు

ప్రతిరోజూ ఆకుకూర పచ్చడి

ఆర్గానిక్ గార్డెన్‌లో చేపట్టిన కూరగాయల సాగుతో వచ్చిన పంటను ఏరోజు కారోజు వినియోగిస్తున్నారు. ప్రతి రోజూ సాయంత్రం భోజనంలో ఒక ఆక కూర పచ్చడి చేసి వడిస్తున్నారు. అంతేకాకుండా వారానికి 50 కిలోల పచ్చి మిరపకాలు దిగుబడి సాధిస్తున్నారు. అన్ని రకాల పంటల సాగును ఆర్గానిక్ పద్ధతిలోనే చేపడుతున్నారు. ఆకుకూరలు, కూరగాయల సాగులో ఆవు పేడతో పాటు చెట్ల ఆకులతో తయారు చేసిన వర్మీ కంపోస్టు ఎరువులను, ఆహార పదార్థాల వ్యర్థాలను మాత్రమే వినియోగిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు.

సామాజిక బాధ్యత అలవర్చుకునేలా

పాఠశాలలో ఏ కార్యక్రమం జరిగినా గార్డెన్‌లో పెంచిన పువ్వులతో అలంకరిస్తున్నారు. అదేవిధంగా విద్యార్థుల పుట్టిన రోజులను వేడుకగా చేయడంతో పాటు పాఠశాల తరుఫున మొక్కను అందజేసి, దానిని పెంచే బాధ్యతను విద్యార్థికి అప్పగిస్తున్నారు. దీంతో పాఠశాల ఆవరణ పచ్చదనంతో నిండిపోవడంతో మొక్కల పెంపకం, ప్రకృతి వ్యవసాయంపై అవగాహనతో పాటు సామాజిక బాధ్యతను అలవర్చుకునేలా చేస్తున్నారు. గార్డెన్‌లో పండించిన పంటలతో నాణ్యమైన భోజనంతో పాటు ఖర్చు కూడా తగ్గిందని ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు.

ఆరోగ్యకర భోజనం అందిస్తున్నాం



పాఠశాల ఆవరణలోని గార్డెన్‌లో ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేపట్టాం. అక్కడ పండించిన ఆకుకూరలు, కూరగాయలతోనే నాణ్యమైన ఆరోగ్యకరమైన భోజనం అందిస్తున్నాం. పప్పులో ఏదో ఒక ఆక కూర వేసి వండిస్తున్నాం. అంతేకాకుండా రాత్రి భోజనంలో ఆకు కూర పచ్చడి ఉండేలా చూస్తున్నాం. బంతి పూల సాగుతో ఏ కార్యక్రమానికైనా బయట నుంచి పూలు కొనడం మానేశాం.

రవికుమార్, బీసీ గురుకుల ప్రిన్సిపాల్

రుచికరమైన కూరలు తింటున్నాం



పాఠశాల ఆవరణలో పండించిన ఆకుకూరలు, కూరగాయలతో చేసిన రుచికరమైన వంటలను తింటున్నాం. ప్రతి రోజూ నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారు.

జే అనిల్, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి

అమ్మానాన్నల కష్టం తెలుస్తోంది



పాఠశాల ఆవరణలోని ఆర్గానిక్ గార్డెన్‌తో రైతులు, అమ్మానాన్నల కష్టం అర్థమవుతోంది. ఎంత కష్టపడి పండిస్తారో అని తెలవడంతో అమ్మ, నాన్నలు పడే కష్టం తెలుస్తోంది. చదువుతో పాటు సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం ఎలా చేయాలో నేర్చుకుంటున్నాం.

కే దినేష్, 8వ తరగతి, విద్యార్థి

కాంగ్రెస్ జెండా దిమ్మెలు ధ్వంసం

- తుప్రాన్‌పేట, దండుమల్కాపురం గ్రామాల్లో కూల్చివేసిన జాగృతి నాయకులు

చౌటుప్పల్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం, తూప్రాన్‌పేట గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ దిమ్మెలను బుధవారం అర్ధరాత్రి తెలంగాణ జాగృతి కార్యకర్తలు ధ్వంసం చేశారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లలో తగ్గింపు నిర్ణయాన్ని నిరసిస్తూ జాగృతి నాయకురాలు కవిత ఇచ్చిన పిలుపు మేరకు మండల పరిధిలోని దండుమల్కాపురం, తూప్రాన్‌పేట గ్రామాల్లో అర్ధరాత్రి కాంగ్రెస్ పార్టీ దిమ్మెలను ఇతర ప్రాంతాలకు చెందిన జాగృతి కార్యకర్తలు ధ్వంసం చేశారు. స్థానిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో జెండా దిమ్మెలను బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కూల్చివేశారని భావించారు. తర్వాత పోలీసుల విచారణలో జాగృతి కార్యకర్తలు ధ్వంసం చేసినట్లుగా సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్ అయ్యాయి.

వీడియోల ఆధారంగా కొంత మంది జాగృతి కార్యకర్తలను ఇతర ప్రాంతాల్లో అదుపులోకి తీసుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మధకుమార్ తెలిపారు. జెండా దిమ్మెల ధ్వంసంతో దండుమల్కాపురం, తూప్రాన్‌పేట గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయ. మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున గ్రామాలకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పబ్బు రాజు గౌడ్, తాడూరి వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెన్‌రెడ్డి రాజు పాల్గొన్నారు.



తుప్రాన్‌పేటలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భక్తి శ్రద్ధలతో తిరుపతమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



బోనం సమర్పించేందుకు వెళ్తున్న వెల్లటూరు గ్రామస్థులు

మేళ్లచెర్వు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం నూతన వెల్లటూరు గ్రామంలో లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య విగ్రహప్రతిష్ఠ గురువారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు పూర్ణకలశాలతో గ్రామసేవ సాగించారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య ఆలయంలో ప్రతిష్ఠాపన జరిగింది. పండుగను ఆనందోత్సహాల మధ్య జరుపుకున్నారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లులో ప్రమాదం

బూడిద తీస్తుండగా కూలీలకు గాయాలు

హుజూర్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులోని సాయిబాలాజీ రైస్‌మిల్లులో ప్రమాదం చోటుచేసుకుంది. వరి పొట్టు బూడిదను లారీలోకి లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కూలీలపై బూడిద గుట్ట కుప్పకూలింది. ఈ ప్రమాదంలో కోదాడ మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన సాధినేని దుర్గ, షేక్ ఫిరోజ్, జాన్‌బీ, షేక్ సైదాలపై బూడిదపడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారికి ప్రాథమిక చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. రైస్‌మిల్లులో బూడిదను చల్లార్చకుండా లారీలోకి లోడ్ చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు గాయపడ్డ కూలీలు తెలిపారు. కాగా ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాధితులను ఆదుకోవాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు.



గాయపడ్డ మదార్

మెడికల్ కళాశాలకు పార్థివదేహం అప్పగింత

నల్లగొండ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కేంద్రంలోని వైద్యకళాశాలకు ఓ వ్యక్తి మృతదేహాన్ని అప్పగించేందుకు వారి కుటుంబ సభ్యులు ముందుకువచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీకి చెందిన బాలగోని శ్రీనివాస్‌గౌడ్(43) బుధవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలియడంతో కాలనీవాసులు కుటుంబసభ్యులను పరామర్శించి శ్రీనివాస్ పార్థివదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు దానం చేసేందుకు ఒప్పించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ ఐకాన్ సహకారంతో డాక్టర్ పుల్లారావు ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల బాధ్యులను సంప్రదించారు. పార్థివదేహం స్వీకరణకు అంగీకరించడంతో అప్పగించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల అనాటమీ విభాగంలో హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ పుష్పమాల, అసిస్టెంట్ ప్రొఫెసర్ అమీరా అఫ్రోజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, బుట్టేడి వీరారెడ్డి, పంతులు శ్రీనివాస్, సింగం రాంమోహన్, సోమగాని శంకర్‌గౌడ్, మర్రి మహేందర్‌రెడ్డి, ముప్ప రేవన్ రెడ్డి, రాములు, ఉదయ్ కుమార్, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలోని మెడికల్ కళాశాల అధికారులకు అంగీకారపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్ కుటుంబ సభ్యులు



పింఛన్ కోసం బారులు

కొండమల్లేపల్లి : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామంలో పింఛన్ కోసం బారులు తీరిన వృద్ధులు. ప్రతి నెలా సక్రమంగా పింఛన్ ఇవ్వడం లేదన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న తపాలాసిబ్బంది జహంగీర్ గురువారం నుంచే పంపిణీని ప్రారంభించారు. దీంతో 100 మందికి పైగా పింఛన్ డబ్బుల కోసం బారులు తీరారు.

రైల్వే కమాన్‌ను ఢీకొట్టిన లారీ

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు రైల్వేట్రాక్ వద్ద నిర్మించిన ఇనుప కమాన్‌ను గురువారం ఢీకొట్టింది. చిట్యాల మండలం పిట్టంపల్లి నుంచి మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలోని సూర్యానారాయణ రైస్‌మిల్లుకు లారీలో ఐకేపీ ధాన్యం తీసుకెళ్తున్నారు. ధాన్యం హెవీలోడ్‌తో వెళ్తున్న లారీని డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ఎత్తు తక్కువగా ఉన్న కమాన్‌ను తాకడంతో రోడ్డుకు అడ్డంగా కుప్పకూలి పడింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి సుమారు గంటపాటు ట్రాఫిక్ జామ్ అయింది. లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా పడిపోయిన కమాన్‌ను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



కూలిపడిన ఇనుప కమాన్

పట్టుదలతో లక్ష్యం వైపు అడుగులు

» సినీ రంగంలో రాణిస్తున్న జాన్‌జక్కీ » సందేశాత్మక చిత్రాలు తీస్తా

తాను అనుకున్న సినిమా రంగంలో తనదైన ముద్ర వేసుకొని ముందుకు సాగుతున్నాడు సూర్యాపేట జిల్లా సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల వల్లాబాపురం గ్రామానికి చెందిన జాన్ జక్కీ అలియాస్ జక్కి కనకయ్య. చిన్నతనం నుంచే కష్టాలు ఎదురైనా అనుకున్న లక్ష్య మే ముందు కన్పించింది. ఎక్కడా రాజీపడకుండా ఒక్కో మెట్టు ఎక్కుతూ లక్ష్యం వైపు వెళ్తున్నాడు.

- ఆంధ్రజ్యోతి, సూర్యాపేట టౌన్



దర్శకత్వం వహిస్తున్న జక్కిజాన్

జాన్‌జక్కి చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయాడు. కుటుంబంలో ముగ్గురు అక్కల తర్వాత అందరికన్నా చిన్న వాడు జాన్‌జక్కి. మూడో అక్క దగ్గర ఉంటూ చదువు సాగించాడు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఉంటూ ఫొటోగ్రఫీ నేర్చుకోవడంతో పాటు సాయంత్రం వైన్స్‌షాప్‌లో వర్కర్‌గా పనిచేశాడు. తర్వాత హైదరాబాద్‌లో ఫొటోగ్రాఫ్ షాప్‌లో పనిచేస్తూ ఈవెంట్లకు వీడియో తీసేవాడు.

దశ తిప్పిన వీడియో టేకింగ్

జక్కిజాన్ హైదరాబాద్‌లో జరిగిన ఓ ఫంక్షన్‌కు వీడియో తీశాడు. వీడియో తీసిన విధానం నచ్చిన ఫంక్షన్ నిర్వాహకుడు సినిమా రంగానికి చెందిన సుబ్రహ్మణ్యం అనే వ్యక్తికి పరిచయం చేయించాడు. దీంతో చిన్న చిన్న సినిమాలకు ఎడిటింగ్ చేయడం ప్రారంభించాడు. ఆ తర్వాత వసుంధర నిలయం అనే డాక్యుమెంటరీ తీశాడు. తర్వాత సంధ్య మోషన్ ఫిక్చర్ అనే సంస్థతో కలిసి చిన్నచిన్న సినిమాలకు ఎడిటింగ్ చేసే పూర్తిగా నిమగ్నమయ్యాడు. అదే సమయంలో 2015లో కల్యాణలక్ష్మీ అనే యాడ్ తీశాడు. అదేవిధంగా దాఫిని అనే చిన్న సినిమా డైరెక్ట్ చేశాడు.

ఆ సినిమా మధ్యలోనే ఆగిపోయింది. దీంతో డిప్రెషన్‌లోకి వెళ్లిన జక్కిజాన్ కొద్దిరోజుల్లోనే కథను రాసుకొని 2022లో గోల్‌మాల్ 2020 అనే సినిమా తీశాడు. ఈ చిత్రం ఆదరణ పొందింది. తర్వాత లాక్‌డౌన్ విరామం తర్వాత మాత్ర అనే భారీ బడ్జెట్ సినిమాను తీశాడు. తెలుగు, తమిళ సినిమా రంగానికి చెందిన ప్రముఖ హీరో శ్రీరామ్‌తో పాటు పేరు పొందిన నటీనటులకు దర్శకత్వం వహించాడు.



సందేశాత్మక చిత్రం తీయడమే లక్ష్యం



సమాజంలో మార్పు తెచ్చేలా సందేశాత్మక చిత్రం తీయడమే లక్ష్యం. వాణిజ్య విలువలతో పాటు సందేశాత్మక చిత్రం భవిష్యత్‌లో తీస్తా. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ అనుకున్న లక్ష్యం సాధించాలి. జీవితం ఎప్పుడూ పూలబాటలా ఉండదు కష్టపడుతూ ముందుకుసాగాలి.

- జక్కిజాన్, దర్శకుడు

జీవిత పాఠాలే ఆయన కథనాలు

» గ్రామీణ వ్యక్తుల జీవితాలే ఇతివృత్తాలుగా రచనలు
» పలు టీవీ సీరియళ్లకు రచయితగా దొంగరి మహేందర్
» బుల్లితెర సీరియల్స్‌కు కథలు, మాటలు రాస్తూ గుర్తింపు



షూటింగ్ సెట్‌లో దొంగరి మహేందర్

గ్రామీణ వ్యక్తుల జీవితాలే ఆయన కథలు. తన చుట్టూ కనిపిస్తున్న వ్యక్తుల జీవితాలను చూసిన ఆయన కవితలు, కథలు రాయడం అలవాటు చేసుకున్నాడు. పదుల సంఖ్యలో బుల్లితెర టీవీ సీరియల్స్‌కు రచయితగా గుర్తింపు తెచ్చుకుంటున్నాడు సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్ గ్రామానికి చెందిన దొంగరి మహేందర్.

- ఆంధ్రజ్యోతి, పెన్‌పహాడ్

సినిమా రంగంపై ఆసక్తి ఉన్న మహేందర్ 2005లో హైదరాబాద్‌కు వెళ్లి దర్శకులు దాసరి నారాయణరావు, తేజ వద్ద అసిస్టెంట్ సినిమా రచయితగా తన ప్రస్తానాన్ని ప్రారంభించారు. వీరి సహకారంతో మొదటిసారిగా ఈ టీవీ ఈ తరం ఫిలిమ్స్‌లో రచయితగా పది సంవత్సరాల పాటు పనిచేశాడు. బుల్లితెర రచయితగా మొదటిసారి ఈ టీవీలో 2014లో 'అడదే ఆధారం' అనే సీరియల్‌కు కథ, మాటలు రాశారు. ఆ సీరియల్ ఈ టీవీలో ఎక్కువ రోజులు వచ్చింది. దీంతో మహేందర్‌కు మంచి పేరు తెచ్చిపెట్టింది. 2015లో మీనాక్షి, 2020లో అమ్మ, 2016లో గోకులంలో సీత, 2021లో అభిషేకం, 2022లో స్వాతి చినుకులు,2022లో లాహిరి లహిరి, 2023లో శతమానం భవతి, 2025లో సంధ్యారాగం వంటి సూమారుగా 20కి పైగా సీరియళ్లకు మహేందర్ రచయితగా పనిచేశారు. ఈ టీవీ తో పాటుగా జెమిని టీవీలో అవకాశం రావడంతో జెమిని టీవీకి కూడా సీరియల్ రచయితగా రాణిస్తున్నాడు. జెమిని టీవీలో వస్తున్న పౌర్ణమి,తాళి, మట్టిగాజులు, అంతులేనికథ, అమ్మోరు వంటి సీరియల్స్‌కు రచయితగా పనిచేశాడు. ప్రస్తుతం అమ్మోరు సీరియల్ షూటింగ్ దశలో ఉండగా మిగతా సీరియల్స్ జెమిని టీవిలో ప్రసార అవుతున్నాయి. మా టీవీలో ఆమె కథ(2023), కథలో రాజకుమారి(2024), వంటి సీరియల్స్‌కు రచయితగా పనిచేశారు. జీ టీవీలో వస్తున్న లక్ష్మీనివాసం (2025), రౌడీ గారి పెళ్లాం(2024), అడవాళ్లు మీకు జోహార్లు(2023) వంటి సీరియల్స్ కూడా మహేందర్ రచయితగా పని చేశారు.

వేణుగోపాల్‌రెడ్డి జీవితంపై డ్యాకుమెంటరీ

మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, అమరుడు కొండేటి వేణుగోపాల్ జీవితంపై జనవరి 19 'చరిత్రలో ఒక రోజు అనే టైటిల్ తో ఒక డ్యాకుమెంట్ తీసి మాజీ సీఎం కేసీఆర్ చేత ప్రశంసలు పొందాడు దొంగరి మహేందర్. వీటితో పాటుగా 'పాప వినాశనం' అనే ఒక డెమో ఫిలింకు కథ, మాటలు, దర్శకత్వం వహించాడు. ప్రస్తుతం ఇది యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉన్న ఒక డెమో ఫిలింగా గుర్తింపు పొందింది. ఈ టీవీలో రోజువారీగా ప్రచారమవుతున్న సంధ్యారాగం, జెమినీ టీవీలో అమ్మోరు అనే సీరియల్స్‌కు దొంగరి మహేందర్ కథ, స్కీన్‌ప్లే, మాటలు రాశారు.

సినిమా దర్శకత్వం ప్రయత్నాలు జరుగుతున్నాయి



గ్రామీణ స్థాయి నుంచి వ్యక్తుల జీవితాలను కథ వస్తువులు చేసుకొని రచయితగా మారాను. ప్రముఖ టీవీ ఛానల్స్ ప్రసారమవుతున్న సీరియల్స్‌కు స్వయంగా కథ, మాటలు రాస్తున్నాను. మంచి దర్శకుడిగా పేరు తెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాను.

- దొంగరి మహేందర్, బుల్లితెర రచయిత.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	582 అడుగులు
ఎడమకాల్వకు నీటి విడుదల	3972 క్యూసెక్కులు
కుడికాల్వకు	9500క్యూసెక్కులు
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
సాగర్‌కు నీటి రాక	15,272 క్యూసెక్కులు
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1800 క్యూసెక్కులు
వరద కాల్వ	నిల్
అవుట్‌ఫ్లో	15,272 క్యూసెక్కులు
మొత్తం గేట్లు	నిల్

- నాగార్జునసాగర్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.88 టీఎంసీలు
నీటి రాక	1000 క్యూసెక్కులు
నీటి విడుదల	8000 క్యూసెక్కులు

- చింతలపాలెం

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	644.30 అడుగులు
నీటి రాక	988.76 క్యూసెక్కులు
గేట్ల ద్వారా విడుదల	నిల్
నీటి విడుదల	1032.24 క్యూసెక్కులు

- కేతేపల్లి

శాలిగౌరారం ప్రాజెక్ట్

పూర్తిస్థాయి నీటి మట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	20 అడుగులు
నీటి రాక	నిల్
నీటి విడుదల	నిల్

-శాలిగౌరారం

హోరాహోరీగా జాతీయస్థాయి క్రీడా పోటీలు

● సెయింట్ జోసప్స్ సీసీఆర్ విద్యానిలయంలో 19వ సీఎస్ఏ క్రీడా పోటీలు




పరుగుపందెం ప్రారంభిస్తున్న ఉపాధ్యాయురాలు

కోదాడటౌన్, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని సెయింట్ జోసప్స్ సీసీఆర్ విద్యా నిలయంలో నిర్వహించిన 19న సీఎస్ఏ జాతీయ స్థాయి క్రీడా పోటీలు, రెండో రోజు గురువారం ఉత్సాహంగా పోటాపోటీగా జరిగాయి. ప్రిన్సిపాల్ జ్యోతి పర్యవేక్షణలో క్రీడల కన్వీనర్ సిస్టర్ ఉడుముల శౌరీ, కరస్పాండెంట్ సిస్టర్ నక్షత్రం రెండో రోజు క్రీడలను ప్రారంభించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, అథ్లెటిక్స్‌లోనూ క్రీడాకారులు సత్తా చాటారు. జాతీయ స్థాయి ఇటువంటి క్రీడలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఐక్యత, స్నేహభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందేందుకు ఉపయోగపడతాయని కన్వీనర్ ప్రొవెన్షియల్ మంగళగిరి, ఉడుముల శౌరీ తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ కర్ణాటక, తమిళనాడు నుంచి వచ్చిన విద్యార్థులు ఒకే వేదికపై తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. క్రీడలను చూసేందుకు ప్రేక్షకులు భారీగా పాఠశాలకు తరలిరావడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది.

30న జానకీపురంలో కబడ్డీ జిల్లా బాలుర జూనియర్ ఎంపిక

ఆలేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం జానకిపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 30న కబడ్డీ బాలుర జూనియర్స్ జిల్లా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి పూల నాగయ్య స్థానిక విలేకరులతో తెలిపారు. ఈ ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు 2006 జనవరి తర్వాత జన్మించి, 20ఏళ్ల వయస్సులోపు, 75కిలోల లోపు బరువు ఉండాలని తెలిపారు. ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు వెంట ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో వెంట తీసుకుని రావాలన్నారు. క్రీడాకారులకు భోజన సదుపాయం ఉందని తెలిపారు. ఉదయం 9 గంటల వరకు మైదానానికి చేరుకోవాలని నాగయ్య తెలిపారు.

కోదాడ విద్యార్థికి అంతర్జాతీయ గుర్తింపు



రమేష్

కోదాడటౌన్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ప్రపంచ సాహిత్య వేదిక ప్రతిష్టాత్మకంగా ఈనెల 30వ తేదీన ఆన్‌లైన్‌లో ప్రతిష్టాత్మకంగా 13 గంటల పాటు బాల సాహిత్య భేరి పేరుతో అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనం నిర్వహించనుంది. ఈ విశేషమైన కార్యక్రమంలో పాల్గొనటానికి తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా, కోదాడ పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్ విద్యార్థి సోమ రమేష్ (10వ తరగతి) ఎంపికైనట్లు ఎంఈఓ సలీంషరీఫ్ తెలిపారు. కథ, వచన, కవిత, గేయం, పద్యం, విభాగాల్లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు విద్యార్థులు 101 మంది కార్యక్రమంలో పాల్గొంటారు. రమేష్ కథా విభాగంలో ఎంపికయ్యాడు. రమేష్ మూడు నిమిషాల పాటు కథ వినిపించనున్నాడు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు డి.మార్కండేయ, తెలుగు భాష ఉపాధ్యాయులు వీరబ్రహ్మాచారి, ముక్కామల జానకిరామ్, చిన్నప్ప, ఉపాధ్యాయులు విద్యార్థికి అభినందనలు తెలిపారు. అనంతరం విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు, ప్రఖ్యాత బాల సాహితీవేత్తలు, జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొంటున్న ఈ కార్యక్రమంలో తమ పాఠశాల విద్యార్థినికి అరుదైన అవకాశం కల్పించిన తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలికి తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ తోటకూర ప్రసాద్, సమన్వయ కర్త చిగురుమళ్ల శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఒలంపియాడ్ ఎడ్యుక్వెస్ట్‌కు కోదాడ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

కోదాడటౌన్, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): సీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈఎల్‌టీఏ(ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్) కోదాడ ఆధ్వర్యంలో కోదాడ మండలస్థాయి ఇంగ్లీష్ ఒలంపియాడ్, ఎడ్యుక్వెస్ట్ కాంపిటీషన్ నిర్వహించినట్లు పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ కాంపిటిషన్లో ఒలంపియాడ్ సీనియర్స్‌లో కే.పూజశ్రీ, జూనియర్స్‌లో అన్నా ఫాతిమా ఎడ్యుక్వేస్టులో సీనియర్స్‌లో కె.పూజ, జూనియర్స్‌లో ఎస్‌కె షైమూనా ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయిలో నిర్వహించే తెలంగాణ ఇంగ్లీష్ ఒలంపియాడ్, ఎడ్యుక్వెస్ట్‌కు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఈల్టా సూర్యాపేట జిల్లా కార్యదర్శి షహనాజ్, కోదాడ మండల కన్వీనర్ కడారు రామకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు ఇ.శ్రీనివాస్‌రెడ్డి, బి.కనకమ్మ, జి.సైదయ్య, బి. సైదులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఔదార్యం.. కళా మహోత్సవ్‌కు విద్యార్థినులు

● బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌కు జిల్లానుంచి 50మంది విద్యార్థినులు ● రెండు బస్సుల్లో పయనం ● బస్సులు, అల్పాహారం, భోజనం, స్నాక్స్ ఏర్పాటు



కళా మహోత్సవ్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న విద్యార్థినుల బస్సుకు జెండా ఊపుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని బొల్లారంలో ఉన్న రాష్ట్రపతి నిలయంలో అదేవిధంగా ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న భారతీయ కళా మహోత్సవ్‌కు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల నుంచి 50మంది విద్యార్థినులను పంపించారు. చదువే అన్నింటికీ మూలమని, చదువుతోనే అభివృద్ధి సాధ్యమని విశ్వసించే నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తాను జిల్లాలో ఎక్కడ పర్యటించినా ముందుగా పాఠశాలలు, కేజీబీవీలను సందర్శిస్తారు. ప్రత్యేకించి విద్యార్థినుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలిస్తారు. వారికి ప్రశ్నలు వేసి జవాబులు రాబడతారు. తర్వాత చాక్లెట్లు ఇచ్చి ఉత్సాహం నింపు తారు. ఇందులో భాగంగా పదో తరగతిలో ఉత్తమ గ్రేడ్లు సాధించిన విద్యార్థినులను తన సొంత ఖర్చుల తో విమానంలో విహారయాత్రకు పంపిన విషయం తెలిసిందే. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి విద్యార్థినిలు వెళ్లే ప్రత్యేకంగా రెండు బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుతోపాటు, భారతీ య సంస్కృతి, సాంప్రదాయాలు, కళలు, తదితర అంశాల్లో ప్రావిణ్యం సాధించేందుకు ప్రోత్సహించాల న్నారు. అందుకే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీల నుంచి విద్యార్థినులను ఎంపిక చేసి కళా మహోత్సవ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. బస్సులతో పాటు అల్పాహారం, భోజనం, సాయంత్రం స్నాక్స్ వంటివి ఏర్పాటు చేశారు. బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన విద్యార్థులు అక్కడి రోజ్‌గార్డెన్, రాక్, నక్షత్ర, హెర్బల్ ఉద్యాన వనాలు, ఫొటో గ్యాలరీ, యోగ జోన్, మ్యూజికల్ ఫౌంటేన్లు, చిల్డ్రన్స్ పార్క్, 120ఫీట్ల ఎత్తైన ఫ్లాగ్, 150 సంవత్సరాల టాకింగ్‌ట్రీని చూసి అనుభూతి పొందారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

● మాజీమంత్రి జగదీష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 29వ తేదీన నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు, దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు మూలమలుపైన రోజు నవంబరు 29వ తేదీ అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. బీఆర్ఎస్ అనేది పుట్టకపోతే తెలంగాణ రాష్ట్రం లేదని, అందుకే ప్రతి తెలంగాణ వ్యక్తి ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నాలన్నారు. సమైక్య పాలనలో తెలంగాణ అనే పదం పలకాలంటే భయపడే రోజుల్లో కేసీఆర్ తన పదవికి రాజీనామా చేసి టీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేసి ప్రజల్లోకి తెలంగాణ నినాదాన్ని తీసుకెళ్లారన్నారు. కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రే కాకుండా, తెలంగాణ తెచ్చిన ముఖ్యమంత్రిగా నేటి తరానికి తెలియజేయాలన్నారు. మోదీ, చంద్రబాబు, రేవంత్ లాంటి వారు ఎన్ని కుట్రలు చేసినా కేసీఆర్‌ను ఏమీ చేయలేరన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రెండేళ్లుగా సమైక్య పాలన సాగుతోందన్నారు. చంద్రబాబు ఏజెంట్ ఇక్కడ అక్కడి ప్లాన్‌లను అమలు చేస్తున్నారన్నారు. విలువైన భూములను ఆంధ్ర ప్రాంతం నేతల వద్ద కమీషన్ తీసుకొని వారికి భూములను ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపా ల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, కూసు కుంట్ల ప్రభాకర్‌రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, నోముల భగత్, నాయకులు చెరుకు సుధాకర్, పల్లె రవికుమార్, రేగట్టే మల్లికా ర్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, ప్రసన్న రాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ




ప్రయాణికురాలికి ఫోన్ అప్పగిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

దేవరకొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్ వెళుతున్న బస్సులో రూ.1.10లక్షల విలువజేసే ఐఫోన్‌ను ప్రయాణికురాలు గురువారం బస్సులో మర్చిపోయి హైదరాబాద్ కర్మన్‌ఘట్ స్టేజీ వద్ద దిగిపోయారు. గమనించిన కండక్టర్ వనం యాదగిరి, డ్రైవర్ మహమ్మద్ అలీలు ప్రయాణికురాలు మర్చిపోయిన ఫోన్‌ను భద్రపరిచి దేవరకొండ ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో విచారణ జరిపిన డిపో మేనేజర్ సైదులు ప్రయాణికురాలు మర్చిపోయిన ఫోన్‌ను గుర్తించారు. డ్రైవర్, కండక్టర్లు నిజాయితీగా ప్రయాణికురాలికి ఫోన్‌ను అప్పగించారు. దీంతో డిపో మేనేజర్ సైదులు డ్రైవర్, కండక్టర్‌లను అభినందించారు.

కనగల్‌లో ఒకే రోజు మూడు సాధారణ ప్రసవాలు

కనగల్, నవంబరు 27:(ఆంధ్రజ్యోతి) నల్లగొండ జిల్లా కనగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఒకే రోజులో మూడు సాధారణ కాన్పులు జరిగాయి. రెండు రోజుల వ్యవధిలో నాలుగు కాన్పులు చేశారు. కనగల్ గ్రామానికి చెందిన బుర్రి రేణుకా, ఎస్‌లింగోటం గ్రామాలకు చెందిన ఆలకుంట్ల రేణుకా, ఐతగోని శిరీష పురిటి నొప్పులతో బుధవారం పీహెచ్‌సీలో చేరారు. డాక్టర్ రామకృష్ణ, రమణారెడ్డి పర్యవేక్షణలో స్టాఫ్ నర్స్ కవిత వైద్య సిబ్బంది గర్భిణులకు చికిత్స అందించారు. ఈ ముగ్గురికీ ఆడ శిశువులు జన్మించారు. ప్రసవాల అనంతరం తల్లులు, శిశువులు ఆరోగ్యంగా ఉండటంతో వారి బంధువులు, కుటుంబసభ్యులు డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ప్రాకార మండపంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచరాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణ తంతు నిర్వహించారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారలను సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్ర హవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 18,33,0552 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

పరిశీలిస్తూ.. పర్యవేక్షిస్తూ..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు కొండపైన గురువారం పరిసరాలు పరిశీలించారు. ముందుగా ప్రధాన కార్యాలయం ఎదురుగా పోలీసు కంట్రోల్ రూం పరిశీలించి సీసీ కెమెరాల మానిటరింగ్ సిస్టం, సెక్యూరిటీ వ్యవస్థ వాటి పనితీరు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ వేళల్లో పకడ్బందీ భద్రత చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రసాదాల తయారీ, క్రయవిక్రయాల కేంద్రాలు, ఉచిత ప్రసాద వితరణ పంపిణీ విధానాన్ని కొద్దిసేపు పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యంగా, సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. వైద్యశాలను సందర్శించి వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర వైద్యం అందించేందుకు వైద్య సదుపాయాలు అందుబాటులో బలోపేతం చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.



కంట్రోల్ రూంలో కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఈవో వెంకట్రావు

నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

సూర్యాపేటరూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. డిసెంబరు 11వ తేదీన నిర్వహించే గ్రామ పంచాయతీ ఎన్నికలకు గురువారం నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. సూర్యాపేట మండలంలో 25 గ్రామ పంచాయతీలకు 7 నామినేషన్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. గురువారం మొదటి రోజు 40 మంది అభ్యర్థులు సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. 7 మంది వార్డుల సభ్యులకు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ప్రక్రియను తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో బాలకృష్ణ పరిశీలించారు. నామినేషన్ల కేంద్రాలను రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ బాలునాయక్ పరిశీలించారు.

● అర్వపల్లి : గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు సర్పంచ్ అభ్యర్థులు 15 నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో ఝాన్సీ తెలిపారు. మూడువార్డులకు నామినేషన్లు అభ్యర్థులు వేశారన్నారు. కార్యక్రమంలో సీఈవో అప్పారావు, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో ఝాన్సీ, ఎస్ఐ సైదులు, ఎంపీవో గోపి, కార్యదర్శి నవీన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

● మద్దిరాల : మండలంలో ఐదు క్లస్టర్ల పరిధిలో 17 నామినేషన్లు, మూడు వార్డులకు అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ అయేషాపర్వీనా తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ వీరన్న, ఏఎస్ఐ సాలయ్య, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● నూతనకల్ : మండలంలో సర్పంచ్ అభ్యర్థులు మొత్తం 29 నామినేషన్లు దాఖలు చేశారు. నూతనకల్ 1, ఎడవెల్లి 2, వెంకేపల్లి 3, ఎర్రపహాడ్ 3, దిర్శనపల్లి 1, పెదనెమిల 2, బిక్కుమళ్ల 2, కొత్తతండా 2, మిర్యాల 4, లింగంపల్లి 1, అలుగునూరు 1, మాచనపల్లి 2, తాళ్లసింగారం 1, సోమ్లాతండా 6, టీక్యాతండా 2, మక్కహేమ్లతండా 1, మండలంలో వార్డులకు 23 నామినేషన్లు దాఖలైయినట్లు రిటర్నింగ్ అధికారులు తెలిపారు.

● తుంగతుర్తి : మండలంలోని వివిధ గ్రామాల నుంచి 24 మంది సర్పంచ్ అభ్యర్థులు, 10 మంది వార్డు సభ్యులు పదవికి నామినేషన్లు మొదటి రోజునే దాఖలు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నామినేషన్లు స్వీకరిస్తున్నామని ఎంపీడీవో శేషుకుమార్ తెలిపారు. ఎన్నికల్లో ప్రతి ఓటు విలువైనదని ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు, స్థానిక నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

●ఆత్మకూర్ (ఎస్) : మండలంలో నామినేషన్ల ప్రక్రియ ను మండల ఎన్నికల అధికారులు ప్రారంభించారు. మొత్తం 30 సర్పంచులకు, 5 వార్డులకు నామినేషన్ల ను అభ్యర్థులు దాఖలు చేశారు.



సూర్యాపేట మండలంలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో బాలకృష్ణ

జిల్లాలో మొదటి రోజు నామినేషన్లు...

సూర్యాపేట(కలెక్టరేట్), : జిల్లాలో మొదటి విడత నిర్వహించే పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన గురువారం నామినేషన్ల స్వీక రణ ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలో మొదటి విడతలో 8 మం డలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎనిమిది మండలాల పరిధిలో 159 గ్రామ పంచాయితీలు, 1442 వార్డులు ఉన్నాయి. కాగా మొదటి రోజు 159 గ్రామ పంచాయితీలకు గాను సర్పంచ్‌గా పోటీ చేసేందుకు 207 నామినేషన్లు, 1442 వార్డులకు 38 నామినేషన్లు దాఖలయ్యాయి.

మండలం	పంచాయతీలు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
తుంగతుర్తి	24	24	218	9
నాగారం	14	30	132	4
నూతనకల్	17	34	166	8
తిరుమలగిరి	16	17	132	0
అర్వపల్లి	17	15	152	3
మద్దిరాల	16	17	148	2
సూర్యాపేట	25	40	220	7
ఆత్మకూర్(ఎస్)	30	30	274	5
మొత్తం	159	207	1442	38

పున్న కైలాష్‌నేతపై మంత్రి వ్యాఖ్యలు సరికావు



తిరుమలగిరి : సమావేశంలో మాట్లాడుతున్న రాంప్రభు

తిరుమలగిరి, నవంబరు27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, బీసీ నేత పున్న కైలాష్‌నేతపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలు సరికావని బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు అన్నారు. తిరుమలగిరిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి వెంకట్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. సమావేశంలో తుమ్మ చంద్రమౌళి, మురళి, వెంకటనారాయణ, ప్రవీణ్, నరసింహ స్వామి పాల్గొన్నారు.

కామ్రేడ్ సూర్యం ఆశయాలను సాధించాలి

గరిడేపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నిజాం దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి అసువులు బాసిన కామ్రేడ్ వక్కంతుల సూర్యం ఆశయాలను సాధించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య అన్నారు. మండలంలోని వెలిదండలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ వక్కంతుల సూర్యం వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం లక్ష్మయ్య మాట్లాడుతూ ఆనాటి భూస్వామ్య, నిజాం దోపిడీకి వ్యతిరేకంగా పీడిత ప్రజల కోసం గెరిల్లా యుద్ధం చేసి మిలటరి మూకల చేతిలో కాల్చి చంపబడిన కామ్రేడ్ సూర్యం ఆశయాలను సాధించాలని ఆయన కోరారు.కార్యక్రమంలో సాంబయ్య, శ్రీను, నగేష్, మల్లయ్య, అంజయ్య, ముత్తయ్య, రాజేశ్వరీ, నాగేంద్ర, మంగమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడొద్దు



విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న హెచ్ఎం మధు

నేరేడుచర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల బారిన పడి ఉజ్వల భవిష్యత్తు కోల్పోవద్దని ప్రజా కళాకారులు బాదె నర్సయ్య కోరారు. మండలంలోని సోమారం పాఠశాలలో గురువారం ఆయన విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంపై కలిగే అనర్థాలపై ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల యువత పెడదారి పడుతుందని గంజాయి తాగడం మూలాన జీవితాన్ని కోల్పోతున్నారని నేటి సమాజంలో ఎదుర్కొంటున్న అటుపోట్లను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మంజుల, శ్రీనయ్య, హరీష్, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

హుజూర్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ మాజీ ఛైర్మన్ దొంతగాని శ్రీనివాస్ కోరారు. పట్టణంలో గురువారం సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ సహకారంతో పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వల్లబుదాసు కృష్ణ, కోల మట్టయ్య, శ్రీను, వెంకన్న, రాము, సోమయ్య, వెంకటేశ్వర్లు, కనకమ్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నూతనకల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల సమగ్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు జెన్నారెడ్డి వివేక్‌రెడ్డి అన్నారు. మాజీ ఎంపీపీ కాసోజు సుమలత, సింగిల్ విండో డైరెక్టర్ కాసోజు మదనాచారి గురువారం మండలంలోని పెదనెమిలలో వివేక్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో యాస ఎల్లారెడ్డి, సాధినేని వెంకన్న, మస్కాపురం వెంకన్న, కాసోజు ఉపేందర్, మధు రాంబాబు, సందీప్, వీరబాబు, కనకారెడ్డి ఉన్నారు.

సీపీఎం నాయకుడు ఆవుల సైదులుకు నివాళి

హుజూర్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన సీపీఎం నాయకులు ఆవుల సైదులు(58) గుండెపోటుతో మృతి చెందారు. సైదులు మృతదేహానికి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగారపు పాండు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, పోసనబోయిన హుస్సేన్, తంగెళ్ళ వెంకటచంద్ర, చందాల భిక్షం, వెంకటయ్య, వీరస్వామి, వెంకటరెడ్డి, గోపరాజు, నీలమ్మ పాల్గొన్నారు.

'ప్రజావాణి'తో పరిష్కారం

(5వ పేజీ తరువాయి)

అర్జీలు వస్తున్నాయి. ఆన్‌లైన్ తప్పులతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు దూరమవుతున్నాయని, సాయం అందకుండా పోతుందని అర్జీలు పెట్టుకుంటున్నారు. వీటన్నింటిని సంబంధిత తహసీల్దార్లకు పంపించి సరిచేయాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. సామాజిక అంశాలపైనా ఉన్నతాధికారులను పలువురు కలిసి విన్నవిస్తున్నారు. తమ పిల్లలు తమను పట్టించుకోవడం లేదని వృద్ధులు అర్జీలు అందజేస్తున్నారు. ప్రతీ ప్రజావాణిలో ఇలాంటివి 2 నుంచి 3 అర్జీలు ఉంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. వైద్య శాఖకు సంబంధించి 44 అర్జీలు రాగా 26 పరిష్కారమయ్యాయి. 18 పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉండగా ఇటీవల ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డులు మంజూరు చేయడంతో వాటి కోసం చాలా అర్జీలు తగ్గాయంటున్నారు. వీటికి తోడు సదరం సర్టిఫికెట్ పొందినప్పటికీ పింఛన్లు మంజూరు కాకపోవడంపై దివ్యాంగులు అర్జీలను పెట్టుకుంటున్నారు.

మరుసటి రోజే ఆన్‌లైన్

ప్రతీ శాఖకు సంబంధించిన అధికారి ఒకరు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి హాజరవుతున్నారు. సోమవారం నిర్వహించే ప్రజావాణిలో అందించే అర్జీలను మంగళవారం ఆన్‌లైన్ చేసి సంబంధిత మండలాలు, శాఖలకు పంపిస్తున్నారు. ఎక్కువగా తహసీల్దార్లు పరిష్కరించాల్సినవే ఉంటున్నట్లు సమాచారం. సామాజిక పింఛన్ల కోసం వచ్చే అర్జీలను ఎంపీడీవోలకు అందజేస్తున్నారు.

అర్జీల పరిష్కారంపై సమీక్ష

జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ప్రతీ నాలుగు రోజులకోసారి ప్రజావాణి అర్జీల పురోగతిపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో విచారిస్తున్నారు. ఎన్నింటికి పరిష్కారం లభించింది, మిగిలిన వాటి పరిస్థితి ఏంటని ఆరా తీస్తున్నారు. వాటి పరిష్కారానికి సూచనలు చేస్తున్నారు. పింఛన్ల వంటి సమస్యలపై ప్రభుత్వ నిర్ణయం మేరకు వేచి చూస్తున్నారు. కొంతమంది అధికారులు ప్రజావాణి దరఖాస్తుల పరిశీలనపై అలసత్వం వహిస్తే చర్యలు కూడా తీసుకుంటున్నారు. వారికి షోకాజు నోటీసులు కూడా అందజేస్తున్నారు.

త్వరగా పరిష్కారానికి చర్యలు

ప్రజావాణిలో వీలైనంత తొందరగా అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల కుమారులు సరిగా చూసుకోవడంలేదని వృద్ధుల ఫిర్యాదులు పెరిగాయి. వీటిపై కూడా చర్యలు తీసుకుంటాం. తల్లిదండ్రులను చూసుకోని పిల్లలపై చట్టపరమైన చర్యలు ఉంటాయి.

- సీతారామారావు, అదనపు కలెక్టర్

పండ్ల వ్యాపారులు ఐక్యంగా ఉండాలి



ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘం అధ్యక్షుడు షేక్ షమీ

కోదాడటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : పండ్ల వ్యాపారులు ఐక్యంగా ఉండాలని ఆ సంఘం అధ్యక్షుడు షేక్ షమీ తెలిపారు. కోదాడ పట్టణంలోని సంఘం కార్యాలయంలో గురువారం సభ్యుల సంక్షేమానికి ఆడ పిల్లల వివాహాలకు రూ. 5వేల చొప్పున ము గ్గురికి రూ.15 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల వ్యాపారస్తులకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో సంఘ సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సా యం పెంచనున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో సెక్రటరీ ఇస్మాయిల్ కోశాధికారి సుభాని, నరసింహారావు, సలీమ్, సైదా, ఎల్లమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలి

● హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

హుజూర్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీవో శ్రీనివాసులు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ వ్యాప్తంగా సర్పంచ్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. నామినేషన్ సెంటర్లలో ఎప్పటికప్పుడు వివరాలు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. పోలీసులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమంత్‌రెడ్డి, ఎంపీఈఓ లావణ్య, ఎస్ఐ బండి మోహన్ పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణంపై పట్టు సాధించాలి

● భగవద్గీత ప్రవచనకర్త ఉమారాణి

హుజూర్‌నగర్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ భగవద్గీత పారాయణంపై పట్టు సాధించాలని భగవద్గీత ప్రవచనకర్త ఉమారాణి కోరారు. జిల్లా స్థాయి భగవద్గీత పారాయణ పోటీల్లో హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన భగవద్గీత ప్రవచనకర్త ఉమారాణి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు.

గతంలో తిరుపతిలో నిర్వహించిన భగవద్గీత పారాయణ పోటీల్లో ఆమె రాష్ట్రం నుంచి పాల్గొని అనేక బహుమతులు సాధించారు . దీంతో బుధవారం సూర్యాపేట జిల్లా స్థాయిలో నిర్వహించిన భగవద్గీత పారాయణ పోటీల్లో న్యాయనిర్ణేతగా వ్యవహరించి ప్రతిభ కలిగిన విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఉమారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు భక్తిభావం కలిగి ఉండాలన్నారు. హిందూధర్మ పరిరక్షణకు పాటుపడాలన్నారు.

గీత కార్మికుల మహాసభలను జయప్రదం చేయాలి



హుజూర్‌నగర్ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న గీత కార్మికులు

సూర్యాపేటటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం రాష్ట్ర మహాసభల స్థలాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. సంఘ పోరాట ఫలితంగానే వృత్తి పింఛన్లు, ఎక్స్‌గ్రేషియా పెంపు, సభ్యత్వం, గుర్తి ంపు కార్డులు, వృత్తిపన్ను రద్దు, నీరాపాలసీ వంటివి రావ డం జరిగిందన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలో ప లు గోడలపై గీతన్నల రణభేరి అనే రాతలు రాసే కార్యక్రమం నిర్వహించారు.

● హుజూర్‌నగర్ : గీత కార్మికుల సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు బి.వెంకటేశ్వర్లు, బత్తిని చంద్రయ్య కోరారు. గురువారం మండలంలోని శ్రీనివాసపురంలో కల్లుగీత కార్మికుల సంఘం రాష్ట్ర 4వ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర మహాసభలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కె.లచ్చయ్య, వీరనాగులు, గోవింద్, రాజు, నర్సింహారావు పాల్గొన్నారు.

కొండేటి వెంకటరెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటాం

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



వెంకటరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

పెన్‌పహాడ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : కొండేటి వెంకటరెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని మాజీ మంత్రి, ఎమ్మె ల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దోసపహాడ్ గ్రామానికి చెందిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ మాజీ గ్రామ అధ్యక్షుడు కొండేటి వెంకటరెడ్డి (52) గుండెపోటుతో మృతి చెందారు. గురువారం గ్రామంలో వెంకటరెడ్డి మృతదేహంపై ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వెంకటరెడ్డి మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. సంతాపం తెలిపిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, మండల ప్రధాన కార్యదర్శి వెన్న సీతారాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు మేకల శ్రీనివాస్, చెన్ను శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకుడు కొండేటి భిక్షం రెడ్డి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌కు మరో రింగ్ రోడ్డు

● ఎన్ఎస్‌పీ కాలువ కట్ట నుంచి ఏర్పాటుకు సన్నాహాలు
● గడ్డిరెడ్డి ఫంక్షన్‌హాల్ నుంచి శ్రీనగర్ కాలనీ వరకు రోడ్డు నిర్మాణం
● సుమారు 6 కిలోమీటర్ల కొత్త రోడ్డుకు ప్రతిపాదనలు

హుజూర్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హుజూర్‌నగర్ పట్టణానికి మరో రింగ్ రోడ్డు రాబోతోంది. పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరిగిపోతుండడంతో రెండో రింగ్‌రోడ్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. హుజూర్‌నగర్‌లోని 167వ జాతీయ రహదారికి అనుసంధానంగానే రెండో రింగ్‌రోడ్డు కూడా ఏర్పాటు చేయనున్నారు. కాగా నూతనంగా నిర్మించనున్న రెండో రింగ్‌రోడ్డుకు సంబంధించి గడ్డిరెడ్డి ఫంక్షన్‌హాల్ నుంచి ప్రారంభమై శ్రీనగర్ కాలనీ వరకు రోడ్డు నిర్మించనున్నారు. ఈ మేరకు రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేయాలని అధికారులను ఆదేశించింది. ఆరునెలల క్రితం హైదరాబాద్‌లో నిర్వహించిన అభివృద్ధి పనుల సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పలువురు ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు నూతన రింగ్‌రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించడంతో ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. రెండో రింగ్‌రోడ్డు నిర్మాణం మొత్తం ఎన్ఎస్‌పీ కాల్వ కట్ట పక్కన నిర్మాణం చేయాలని అధికారులను ఆదేశించిన నేపథ్యంలో శరవేగంగా భూసేకరణకు దృష్టి సారించారు. సుమారు 6 కిలోమీటర్ల మేర రూ.14 కోట్లతో ఈ రోడ్డు నిర్మాణానికి రంగం సిద్ధం చేస్తున్నారు. నెలరోజుల్లోనే భూసేకరణ పూర్తిచేసి పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



రెండో రింగ్ రోడ్డునిర్మించనున్న ప్రతిపాదిత ప్రాంతం

రింగ్ రోడ్డు ఇలా..

రెండో రింగ్ రోడ్డు గడ్డిరెడ్డి ఫంక్షన్‌హాల్ నుంచి లింగగిరి మేజర్ కాలువ కట్టపక్క ఎడమ వైపు నుంచి ఎన్‌జీఓఎస్ కాలనీ, హనుమాన్ టెంపుల్ పక్క నుంచి దీక్షిత్‌నగర్, ఎన్ఎస్‌పీ క్యాంప్, ఎన్టీఆర్ కాలనీ, శ్రీనగర్ కాలనీ వరకు కొత్త రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. కాగా అమ్మ హాస్పిటల్ ఉత్తమ్ పద్మావతినగర్ కాలనీ మీదుగా ఎన్టీఆర్‌నగర్ కాలనీ, ఎన్ఎస్‌పీక్యాంప్, శ్రీనగర్ కాలనీ వరకు రోడ్డు నిర్మించనున్నారు. ఈ రెండు రోడ్లు కూడా కోదాడ నుంచి వచ్చే 167వ జాతీయ రహదారికి సంబంధించి అంతర్గత రింగ్ రోడ్లను ఏర్పాటుచేయనున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ నుంచి లింగగిరి మేజర్ కాలువ కట్టల మీదుగా రింగ్ రోడ్డు నిర్మాణం చేయడం వల్ల హుజూర్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ చేసేందుకు ఎంతగానో ఉపయోగపడనుంది. అలాగే పట్టణంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రాణ నష్టం జరగకుండా ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

రెండో రింగ్ రోడ్డుతో మెరుగైన రవాణా



పట్టణంలో లింగగిరి మేజర్ కాలువ కట్ట ఎడమవైపు నుంచి రెండో రింగ్‌రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో భూసేకరణ చేపడుతున్నారు. కాల్వ కట్టపైన ఉన్న ఆక్రమణలను తొలగించి మరో 6 కిలోమీటర్లు రింగ్ రో డ్డు నిర్మించనున్నాం. నూతనంగా నిర్మించే రింగ్‌రోడ్డుతో మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడుతుంది.

-గెల్లి రవి, హుజూర్‌నగర్

రెండో రింగ్‌రోడ్డుకు భూసేకరణ

హుజూర్‌నగర్‌లోని గడ్డిరెడ్డి ఫంక్షన్‌హాల్ నుంచి లింగగిరి మేజర్ కాలువ కట్ట పక్క నుంచి ఎన్‌జీవోస్ కాలనీ, దీక్షిత్‌నగర్, ఎన్ఎస్‌పీ క్యాంప్ మీదుగా శ్రీనగర్ కాలనీ వరకు మేజర్ కాలువకు ఎడమ వైపు రింగ్ రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం ఎన్ఎస్‌పీ, ఆర్‌అండ్‌బీ శాఖల సమన్వయంతో సుమారు 6 కిలోమీటర్ల రోడ్డు నిర్మించేందుకు దృష్టి సారించాం. పట్టణ ప్రజల విజ్ఞప్తి మేరకు మంత్రి ఆదేశాలతో రెండవ రింగ్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తున్నాం.

-రమేష్‌బాబు, ఆర్‌అండ్‌బీ డీఈ

వరికొయ్యలకు నిప్పు పెట్టొద్దు



తమ్మరలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

కోదాడ రూరల్/మోతె/ఆత్మకూర్ (ఎస్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వరి కోత తర్వాత గడ్డి తగలబెట్టడం వల్ల కలిగే నష్టాలను రైతులు తప్పక తెలుసుకోవాలని కోదాడ, మోతె, ఆత్మకూర్(ఎస్) మండల వ్యవసాయాధికారులు పాలెం రజనీ, అరుణ దివ్య సూచించారు. కోదాడ మండలం తమ్మర, మోతె మండలం మామిళ్లగూడెం, ఆత్మకూర్(ఎస్) మండలం ఏపూర్ గ్రామాల్లో గురువారం వరికొయ్యలకు నిప్పుపెడుతున్న రైతులను కలిసి వారు కలిసి అవగాహన కల్పించారు. వరిని కాల్చడం వల్ల నేలపై ఉన్న సేంద్రియ పోర కాలిపోతుందని, తద్వార పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. భూమి లోపల భాగంలో ఉన్న చిన్నజీవులు చనిపోవడంతో పంటలకు కావాల్సిన జీవాలు లేకుండా పోవడం జరుగుతుంది. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు నగేష్, శివమూర్తి, రైతులు పాల్గొన్నారు.

సమాలోచనలు

(5వ పేజీ తరువాయి)

ప్రధానంగా అమలుపరుస్తున్న ఎన్నికల హామీలపై ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించనున్నారు. రైతు రుణమాఫీ, సన్నరకం ధాన్యానికి బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు, రైతు భరోసా, సాదాబైనా పథకాలను ప్రధాన ప్రచారాస్త్రాలుగా ఎంచుకోనుంది. వీటికి తోడు బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలను ప్రజలకు వివరించి వారి విశ్వాసాన్ని చూరగొనే ప్రయత్నాలు చేయనున్నారు. ఈ క్రమంలో మొదట కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు.

గెలుపు గుర్రాల కోసం అన్వేషణ

గెలిచే అభ్యర్థుల కోసం పార్టీలు అన్వేషణ ప్రారంభించాయి. అయితే పలుచోట్ల రిజర్వేషన్లు పలువురిని నిరాశపరిచాయి. ముఖ్యంగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో రిజర్వేషన్ల విషయంలో స్థానిక నాయకులు అనుకున్నది ఒక్కటి అయిందొక్కటి అన్న విధంగా ఉందని ఆశావహులు నిరుత్సాహంతో ఉన్నారు. దీంతో అభ్యర్థుల ఎంపిక కూడా పార్టీ నాయకులకు కొంత మేర తలనొప్పిగా మారింది.

అప్పుడే మొదలైన ఖర్చు

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంతోనే ఆశావహులకు ఖర్చు మొదలైంది. పార్టీ నుంచి టికెట్ వస్తుందో రాదో కానీ ముందుగా ఖర్చు మాత్రం తప్పడంలేదు. దీంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా సందడి వాతావరణం, ఎన్నికలపైనే చర్చలు జరుగుతున్నాయి. గ్రామాల్లో ఆశావహులు, పోటీ చేసే వారికి ఎన్నికల ఖర్చు అదనపు భారమైంది. గ్రామాల్లో ముందస్తు మద్యం దావత్‌లు మొదలయ్యాయి.

ధనబలం, సామాజికరణాల పరిశీలన

పంచాయతీ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్టీలు వివిధ అంశాలను పరిశీలిస్తున్నాయి. ముఖ్యంగా ధన బలం ఉన్న అభ ్యర్థులను ఎంపిక చేయడంతో పాటు గ్రామాల్లోని ఓటర్లలో వారి సామాజిక భాగం ఎంతనేది పరిశీలిస్తున్నారు. ఎవరికి మద్దతు తెలిపితే విజయం సాధించే అవకాశాలు ఉన్నాయనే కోణంలో పరిశీలిస్తున్నారు. ధనబలం, సామాజిక సమీకరణాలతో పాటు పోటీ చేసే అభ్యర్థికి ప్రజల్లో ఉన్న వ్యక్తిగత ప్రతిష్టలను కూడా గమనిస్తున్నారు.